క్లుప్తంగా

ఏపీఓ, ఏపీఎంలకు ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో డ్వామా ఏపీఓ, ఏపీఎంలకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఉపాధి హామీ పథకంలో పనుల ప్రాధాన్యం, మునగ మొక్కల పెంపకంపై తదితర వాటిపై వివరించారు. ఫ్యాకల్టీలు ఎంఎస్ఎన్ రెడ్డి, పి.శ్రీనివాసరావు, నిహారిక, ప్రసాద్, వెంకటేశ్వరరావు పలు అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. విస్తరణ శిక్షణ కేంద్రం వైస్ ప్రిన్సిపాల్ ఇ.కృష్ణమోహన్ పలు అంశాలపై ఫీడ్ బ్యాక్ నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

24న చలో విజయవాడ

పెద్దాపురం: సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 24న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శనివారం స్థానిక మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్రకు మున్సిపల్ కార్మికులు లేఖ అందజేశారు. అనంతరం మస్టర్ పాయింట్‌లో నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్, ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక దిగుబడులు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ భరతలక్ష్మి

పెద్దాపురం: సాంకేతిక పరిజ్ఞానంతో రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు అవగాహన కల్పించాలని వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ భరతలక్ష్మి అన్నారు. స్థానిక వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శనివారం జరిగిన శిక్షణ సందర్శన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు రూపొందించిన నూతన విత్తన రకాలు, సాంకేతిక పరిజ్ఞానం రైతాంగానికి సకాలంలో అందించాలన్నారు. డాక్టర్ పి.మునిరత్నం మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు ఆలస్యం కావడంతో 25 శాతం వరి నాట్లు పడలేదన్నారు. చిరుధాన్యాల సాగు కాకినాడ జిల్లాలో ప్రవేశపెట్టినందుకు శాస్త్రవేత్తలను, అధికారులను అభినందించారు. ఏరువాక కేంద్రంలో కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్‌వీ నరసింహారావు, సీతారామశర్మ, ఎస్.బాలాజీనాయక్, సుధీర్‌కుమార్ ఉన్నారు.

21 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



ఆంజనేయ స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపల్లి: యండపల్లి గ్రామ సచివాలయం పల్లపు వీధి వినాయకుని ఆలయం ఎదురుగా శనివారం 21 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి మూలవిరాట్ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. హనుమాన్ భక్తుల సహాయ సహకారాలతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆంజనేయ ఆలయం వద్ద 3 రోజుల పాటు జిల్లా స్థాయిలో మహిళా భజనా పరిషత్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధనలో మూడు వేల మంది పాల్గొన్నారు.

కాలుష్య కారక పరిశ్రమలను నిలిపివేయాలి



పోస్టర్‌లను ప్రదర్శిస్తున్న సభ్యులు

కొత్తపల్లి: తీరప్రాంతంలో నిర్మిస్తున్న కాలుష్య కారక పరిశ్రమలు తరిమికొట్టి తీర ప్రాంతాన్ని, మత్స్యకారుల జీవనోపాధిని కాపాడుకోవాలని ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 31వ తేదీన స్థానిక ముప్పారపు అచ్చియ్యమ్మ కల్యాణ మండలంలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ ఊర చెరువు సెంటర్ వద్ద శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాంబాబు, ఉప కార్యదర్శి కడితి సతీష్, ఏఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేలు.. రైతు నేస్తాలు

- గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు
- నాలుగేళ్లలో విశేషంగా సేవలు
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు



రైతులకు సబ్సిడీ ఎరువులు పంపిణీ చేస్తున్న దృశ్యం



గొర్పలో రైతు భరోసా కేంద్రం వద్ద సిబ్బంది

కొత్తపల్లి: సాగు దండగ కాదు పండగ అని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరూపిస్తున్నారు. గతంలో కష్టాలు చవిచూసిన రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేలు) ఏర్పాటు చేశారు. ఇవి ప్రస్తుతం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. వాటి ద్వారా సొంత ఊరులోనే రైతులకు అన్ని సేవలు అందుతున్నాయి. నాలుగేళ్లలో రైతు నేస్తాలుగా మారాయి.

అన్ని రకాల సేవలు

గతంలో ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలో ఉండే వ్యవసాయ శాఖ కార్యాలయానికి రైతులు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ ఆర్బీకేలు ఏర్పాటు చేయడంతో రైతులు తమ సొంత గ్రామంలోనే అన్ని సేవలు పొందుతున్నారు. ముఖ్యంగా భూసార పరీక్షలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరంగా ఉంది. ముఖ్యంగా కియోస్కో యంత్రాల ద్వారా రైతులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. తమకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై 48 గంటల్లోనే నేరుగా రైతులకే అందుతున్నాయి. అంతేకాకుండా సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లతోపాటు ట్రాక్టర్లను కూడా అందజేస్తున్నారు.

ఈ క్రాప్ బుకింగ్, పంట నష్ట పరిహారం

ప్రతి రైతు తాము సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ–క్రాప్ బుకింగ్ చేసుకుంటున్నారు. తద్వారా విపత్తులు, తుపాన్ల ద్వారా పంటలు నష్టపోతే ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం పొందే అవకాశముంది. ఈ క్రాప్ సర్టిఫికెట్ ద్వారా బ్యాంకులు రైతులకు పంట రుణాలను అందజేస్తున్నాయి.

మండలంలో వివరాలు

ఆర్బీకేల సంఖ్య :	23
మొత్తం రైతులు :	5800
రైతు భరోసా పథకం లబ్ధిదారులు:	5195
పొందిన లబ్ధి సొమ్ము	రూ.7.01 కోట్లు
ఎరువులు, విత్తనాలు అందుకున్న రైతులు	4500
వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు పొందిన వారు	150
వారికి కలిగిన లబ్ధి	రూ.4.26 కోట్లు

ధైర్యంగా సాగు చేస్తున్నా..



ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన ఆర్బీకేల ద్వారా ఎంతో మేలు జరుగుతోంది. నాలుగేళ్లుగా నాకు రైతు భరోసా వస్తోంది. దీనివల్ల ప్రతి సంవత్సరం ధైర్యంగా పంటలు వేస్తున్నాను. ఊరులోనే ఎరువులు లభిస్తున్నాయి.

– కె.ఫణికుమార్, కుతుకుడుమిల్లి రైతు

ఊరులోనే సేవలు



ఆర్బీకేల ఏర్పాటుతో ఊరులోనే సేవలందుతున్నాయి. ప్రభుత్వం అన్నిరకాల ఎరువులు, సబ్సిడీపై విత్తనాలు అందిస్తోంది. సీజన్లతో సంబంధం లేకుండా ఆర్బీకేల్లో అన్నీ దొరుకుతున్నాయి. మార్కెట్ ధర కంటే ఆర్బీకేల్లో ఎరువులు, విత్తనాలు తక్కువకే లభిస్తున్నాయి.

– యరకం సూర్యనారాయణరెడ్డి, పాత ఇసుకపల్లి రైతు

వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం



సామర్లకోటలో మహాలక్ష్మీ అమ్మవారికి పూజలు

సామర్లకోట: స్థానిక మాండవ్య నారాయణ స్వామి ఆలయంలో వేంచేసి ఉన్న మహాలక్ష్మి అమ్మవారికి శ్రావణ మాసం ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిగాయి. తొలుత పంచామృతాలతో అభిషేకాలు, విశేష సహస్ర నామార్చనలు చేశారు. సాయంత్రం ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ఫ్లైఓవర్, స్టేషన్ సెంటర్, దేవీ చౌక్, గాంధీచౌక్, చిన్న వీధి, పెద్దవీధి, కొత్తూరు మీదుగా గజ వాహనంపై అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు రఘురామ్ ఆచార్యులు, రవికుమార్ ఆచార్యులు పూజా కార్యక్రమాలు జరిపారు.

వార్డు సభ్యత్వాలకు ఎన్నిక ప్రశాంతం



వేట్లపాలెంలో బొబ్బరాడ రాజుకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి



ఓట్లు లెక్కిస్తున్న అధికారులు

పెద్దాపురం: దివిలి గ్రామంలోని ఏడో వార్డు సభ్యత్వానికి శనివారం నిర్వహించిన ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. జె.తిమ్మాపురం, గోరింట, దివిలి గ్రామాలకు చెందిన వార్డు సభ్యుల ఎన్నికల్లో భాగంగా రెండు గ్రామాల వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు దివిలి వార్డు సభ్యత్వానికి ఎన్నిక నిర్వహించారు. దీనికి రిటర్నింగ్ అధికారిగా పి.వీరబాబు వ్యవహరించగా ఎస్ఐ వెలుగుల సురేష్ బందోబస్తు నిర్వహించారు. వార్డు పరిధిలో 303 ఓటర్లకు గాను 266 మంది ఓటు హక్కు సద్వినియోగం చేసుకున్నారు. ఇందులో చెల్లనవి ఐదు ఉండగా, కుంచే శాంతికి 131, బొడ్డపాటి సూర్యకుమారికి 130 ఓట్లు వచ్చాయి. దీంతో కుంచే శాంతి ఒక్క ఓటు మెజార్టీతో గెలుపొందారు. ఆమె ఆర్ఓ వీరబాబు నియామక పత్రాన్ని అందజేశారు. జె.తిమ్మాపురం పదో వార్డు సభ్యుడిగా కడిమి గణేష్, గోరింట నాలుగో వార్డు సభ్యుడిగా కలగాడ చక్రమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయా ఆర్ఓలు కె.సంజయ్‌కుమార్, బి.అప్పలరాజు ప్రకటించారు.

ఆ రెండు గ్రామాల్లో..

సామర్లకోట: వేట్లపాలెం 14వ వార్డు, చంద్రంపాలెం నాలుగో వార్డు ఎన్నికలకు పోలింగ్ శనివారం ప్రశాంతంగా జరిగింది. వేట్లపాలెంలో 770 ఓట్లకు 477 ఓట్లు పోలయ్యాయి. ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పోలింగ్ నిర్వహించి రెండు గంటలకు ఓట్ల లెక్కింపు జరిగింది. ఇక్కడ వైఎస్సార్ సీపీ మద్దతు దారుడు బొబ్బరాడ రాజు 46 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. సీఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. చంద్రంపాలెంలో 292 ఓట్లకు 213 ఓట్లు పోలయ్యాయి. తోట మణికంఠ విజయం సాధించారు. విజేతలకు ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

కొడవలి 12వ వార్డు మెంబర్‌గా ముప్పనబోయిన మణియ్య

పిఠాపురం: గొల్లప్రోలు మండలం కొడవలిలో ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీ 12వ వార్డు మెంబరు ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఇప్పటికే ఈ ఎన్నికకు సంబంధించి నామినేషన్లు స్వీకరించగా నలుగురు నామినేషన్లు దాఖలు చేయగా నలుగురు ఎన్నికల బరిలో ఉన్నారు. దీంతో ఇక్కడ మామూలు వార్డు మెంబరు పదవికి పోటీ నెలకొనడంతో పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం ఎన్నిక నిర్వహించగా తన సమీప అభ్యర్థి కొయ్యా దొరబాబుపై 13 ఓట్ల తేడాతో ముప్పనబోయిన మణియ్య విజయం సాధించారు. మొత్తం వార్డు పరిధిలో 273 ఓట్లు ఉండగా 207 ఓట్లు పోలయ్యాయి 1 ఓటు తిరస్కరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- దుర్గాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం



లబ్ధిదారుకు పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: అర్హతే ప్రామాణికంగా, అవినీతి రహితంగా, పార్టీలు, కుల మత వర్గ విభేదాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు పంపిణీ చేసే ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడైనా చూశారా అంటూ ఎమ్మెల్యే పెండెం దొరబాబు లబ్ధిదారులను అడిగారు. ఆయన శనివారం గొల్లప్రోలు మండలం దుర్గాడ రెండో వార్డు సచివాలయ పరిధిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి ముఖ్యమంత్రి అంటే ఇలా ఉండాలని అనిపించారన్నారు. గత టీడీపీ హయాంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఒక్క పథకం కూడా అందకుండా వివక్షత చూపించారని ఆయన విమర్శించారు. గడపగడపకూ కార్యక్రమానికి వస్తున్న స్పందన ప్రతి పక్షాల గుండెల్లో రైళ్లు పరిగెట్టిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వైఎస్సార్ సీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 12 నుంచి శ్రీపాద శ్రీవల్లభ జయంత్యుత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: వచ్చే నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ నిర్వహించనున్న శ్రీపాద శ్రీవల్లభ స్వామి జయంతి మహోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు భక్తులకు విజ్ఞప్తి చేశారు. శనివారం పిఠాపురంలో శ్రీపాద శ్రీవల్లభ స్వామి జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వస్తారని, వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు పట్టణంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు వసతి తాగునీరు, భోజన సదుపాయాలు కల్పించాలని వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈఓ ఆర్ సౌజన్య మాట్లాడుతూ వచ్చే నెల 12వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ ఉత్సవాల నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ప్రత్యేక పూజలు అభిషేకాలు హోమాలు నిర్వహించనున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు, ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు సిబ్బంది తదితరులు పాల్గన్నారు.

వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి: హేచరీ వ్యాపారంలో వాటా ఇప్పిస్తానని, ఉద్యోగాలు వేయిస్తామని చెప్పి సొమ్ములు తీసుకుని మోసగించిన ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు శనివారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొన్నాడ శివారు సీలంవారిపాలెంకు చెందిన తంటింటి అప్పారావుకు హేచరీలో వాటా ఇప్పిస్తానని, ఉద్యోగాలు వేయిస్తానని మాయమాటలు చెప్పి 2021 మే నెలలో విశాఖపట్నానికి చెందిన బేతాల విజయప్రభాకర్ సుమారు రూ.54 లక్షలను తీసుకున్నాడు. అప్పటి నుంచి అతను గైర్హాజరు కాగా అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా విజయప్రభాకర్‌ను శనివారం పిఠాపురం రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు చేసి పిఠాపురం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

నేడు అండర్–15 చెస్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్: కాకినాడ జిల్లా చెస్ సంఘం, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి అండర్–15 చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధి మనోహర్ శనివారం తెలిపారు. స్థానిక ఆంధ్రాబ్యాంక్ కాలనీలోని సమంత హైట్స్‌లో పోటీలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. కాకినాడకు చెందిన క్రీడాకారులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గల వారు సంబంధిత అర్హత పత్రాలతో హాజరుకావాలని, రిజిస్ట్రేషన్‌కు రూ.300 చెల్లించాలని ఆయన కోరారు.

చెట్ల నరికివేతకు వేలం వాయిదా



చెట్ల వేలం నిర్వహిస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

సామర్లకోట: స్థానిక ఈటీసీ లేఅవుట్‌లోని చెట్లు నరికి తీసుకెళ్లడానికి శనివారం నిర్వహించిన బహిరంగ వేలం వాయిదా పడింది. ఐదెకరాల 75 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న 427 వివిధ రకాల చెట్లను నరికి తీసుకెళ్లడానికి కాకినాడ ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. ప్రభుత్వ పాట రూ.17 లక్షలుగా నిర్వహించి పాటదారులు పాటలో పాల్గొనాలని ఆర్డీఓ సూచించారు. చెట్లలో కొబ్బరి చెట్లు నరికి వేయడానికి ఖర్చు తప్ప వాటి వల్ల ఆదాయం రాదని పాటదారులు తెలిపారు. వేర్లతో పాటు అన్ని చెట్లను తీసువెళ్లడానికి రూ.5.50 లక్షలు చెల్లిస్తామని అన్నారు. దానికి ఆర్డీఓ అంగీకరించక పోవడంతో పాట వాయిదా పడింది. కాగా పాటదారులు అందరూ సమావేశమై ఒకే ధరకు పాట పాడే విధంగా సిండికేట్ అయ్యారని సమాచారం. దాంతో జిల్లా కలెక్టర్ నిర్ణయం మేరకు చెట్ల నరికివేత ఉంటుందని ఆర్డీఓ తెలిపారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి కిశోర్‌బాబు, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, ఆర్వో పూడి రవిబాబు, టీపీఓ ఫణి కుమార్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య శిబిరం

కొత్తపల్లి: స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాకినాడ ఉమామనో వికాశ కేంద్రం ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. మానసిక రుగ్మత వైద్యులు శాంతి మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న సుమారు 85 పరీక్షలు చేసి, మందులను అందజేశారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమా మనోవికాశ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడొద్దు

- జూనియర్ సివిల్ జడ్జి సుధారాణి
- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా దీక్షారంభ్



సమావేశంలో మాట్లాడుతున్న పిఠాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధారాణి

పిఠాపురం: కళాశాలల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి శిక్షార్హులు కావొద్దని పిఠాపురం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.సుధారాణి అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన దీక్షారంభ్ విద్యార్థుల పరిచయ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ పి.సుభాషిణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పిఠాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధారాణి మాట్లాడుతూ 1997 ర్యాగింగ్ నిరోధక చట్టం గురించి విద్యార్థులకు వివరించారు. సీనియర్ విద్యార్థులు కొత్తగా చేరిన వారితో సన్నిహితంగా ఉండాలని, వారిని ర్యాగింగ్ చేసి శిక్షార్హులు కావొద్దని చెప్పారు. ర్యాగింగ్‌కు పాల్పడడం వల్ల ఎందరో మంచి విద్యార్థుల జీవితాలు నాశనమయ్యాయన్నారు. అందుకే అందరు ఈవిషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు రాజారావు, సీనియర్ న్యాయవాదులు విజయకుమార్, లోక్ అదాలత్ నామినేటెడ్ మెంబర్ డి.రమేష్‌బాబు, న్యాయవాదులు బీఏకే ఈశరవరబాబు, స్టూడెంట్స్ ఇంటరాక్షన్ ప్రోగ్రామ్ కన్వీనర్ తెలుగు అధ్యాపకురాలు కె మాదవి, కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీకర్, ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతన సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూప్–1లో చైతన్య ప్రతిభ



తర్లంపూడి చైతన్యను అభినందిస్తున్న ఆర్‌సీ రెడ్డి

సామర్లకోట: సామర్లకోట బలుసులపేటకు చెందిన తర్లంపూడి చైతన్య గ్రూప్–1 మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించాడు. ఈ మేరకు ఎంపీడీఓగా ఎంపిక అయ్యాడు. చైతన్య ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకూ స్థానిక మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో, ఇంటర్ కాకినాడ నారాయణ కళాశాలలో పూర్తి చేశాడు. హైదరాబాద్‌లో సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్న తరుణంలో మొదటి ప్రయత్నంలోనే గ్రూప్–1కు సెలక్ట్ అయ్యాడు. తండ్రి తర్లంపూడి కమల్‌రాజ్ మల్టీ నేషనల్ కంపెనీ కేఆర్‌ఆర్ గ్రూప్ ఇండస్ట్రీస్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. తల్లి ప్రభుత్వ హైస్కూల్ టీచర్. తాత దివంగత తర్లంపూడి సత్తిరాజు మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పని చేశారు. ఆయన వారసత్వంలో తండ్రి వైఎస్సార్ సీపీ పట్టణ సహాయ కార్యదర్శిగా ప్రజా సేవలో ఉన్నారు. సివిల్స్‌లో ఐఏఎస్, ఐపీఎస్ ఏదోకటి సాధించి పేదలకు సేవ చేయాలనే ఆశయంతో సివిల్స్ కోచింగ్ తీసుకొంటున్నానని చైతన్య తెలిపారు. విజేతను ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ (హైదరాబాద్) వ్యవస్థాపకుడు, డాక్టర్ వైఎస్సార్ జీవిత కాల సాఫల్య పురస్కార అవార్డు గ్రహీత ఆర్‌సీ రెడ్డి అభినందించారు.

ఫొటోతో ఎన్నో మధుర జ్ఞాపకాలు



లూయీస్ డాగూరే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్లు



సామర్లకోటలో డాగూరే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

కొత్తపల్లి: ప్రతి క్షణాన్ని ఒక మధుర జ్ఞాపకంగా చూపించేది ఒక ఫొటో మాత్రమేనని ప్రొఫెషనల్ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ కార్యదర్శి పి.బంగారుబాబు అన్నారు. యండపల్లి జంక్షన్ వద్ద ఉన్న తోటలో శనివారం మండల ఫొటో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా సృష్టికర్త లూయీస్ డాగూరే చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఫొటో గ్రాఫర్ బాబీని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వీట్లను పంపిణీ చేశారు. మండల ఫొటో గ్రాఫర్ సంఘ అధ్యక్షుడు కాశి కార్యదర్శి మాట్లాడుతూ మనసులోని భావాలన్నీ ఒకే ఒక చిత్రంలో చెప్పే గొప్పతనం ఫొటోకే మాత్రమే ఉంటుందన్నారు. ఈ వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరూ కమిటీ సభ్యులుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఈశ్వర్‌రెడ్డి, పీహెచ్ జగ్గారావు, పి.శ్రీను, కోటి మల్లికార్జున్, ఎస్.షద్రక్‌బాబు, మలిశెట్టి రంగ, నాగేశ్వరావు, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట మండలంలో..

సామర్లకోట: ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకొన్నారు. పట్టణ, మండలంలోని ఫొటోగ్రాఫర్లు స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉషా స్టూడియో వద్ద కెమెరా సృష్టికర్త లూయీస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డాగూరే జయంతిని పురస్కరించుకుని ఏటా ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని జరుపుకొంటున్నామని సీనియర్ ఫొటోగ్రాఫర్ అడబాల శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం అందరికీ మిఠాయిలు పంచారు. సంఘ నాయకులు సారా శ్రీను, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల దినోత్సవం

పిఠాపురం: ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని శనివారం పిఠాపురంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో పిఠాపురం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త లూయీస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల మృతి చెందిన తోటి ఫొటోగ్రాఫర్లకు నివాళులర్పించారు. అతి తక్కువ సమయంలో ఫొటోగ్రఫీలో రాణించి అవార్డులు సొంతం చేసుకుని సంఘానికి మంచి పేరు తీసుకువచ్చిన స్థానిక ఫొటోగ్రాఫర్ మిరియా సురేష్, సీనియర్ ఫొటోగ్రాఫర్లు గోపి, ఖాదర్, సూరిబాబు, బాలు తదితరులను ఘనంగా సత్కరించారు. సంఘ సభ్యులకు యూనియన్ నాయకులు ఆర్టీల్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స అసోసియేషన్ నాయకులు రుత్తల లోవరాజు, శివ, తరుణ్, రమణ, నాని తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



శృంగారవల్లభ స్వామి



ఆలయంలో భక్తుల క్యూ

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం తొలి శనివారం కావడంతో వేల సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఆలయ టిక్కెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామివారికి రూ.3,68,794 ఆదాయం సమకూరిందని ఈఓ నారాయణమూర్తి తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశామన్నారు. ఆలయ అర్చకుడు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు పాల్గొన్నారు.